
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

వానగురసడం బిడ్డపుట్టడం ఎవురూ జెప్పలేరు అంటావుండేవాడు మా చెన్ను తాత. రోజూ నల్లమోడాలు అట్టా కని పించి యలబారి పోవడమే గానీ, నాలుగు సినుకులు కురిసిన పాపాన పోలేదు.

# మాబున్నీసా

గుండం రామచంద్రారెడ్డి



చెప్పాపెట్టకుండా వచ్చే వానకే బలమని చెబుతా వుండేవాడు తాత.

యాడన్నా బావులకింద వుండే పచ్చిక్కయల్లోకి బొయ్యి నాలుగు గరికిపోగులన్నా పీక్కోని వద్దామని గడ్డిగంపలు సంకల్లో బెట్టుకుని బోతా వుండారు ఆడోళ్లు. అంతే! సారవ కూడా దాటలేదు వాళ్లు. బాబాసాబ్ సేను మిందనుంచి నల్లగా ఎగ్గమ్ముకోని వస్తావుండాయి మోడాలు. ఆ... అయినా మోసకారి మోడాలు రోజూ తొంగిచూస్తానే వుంటాయి. దాండ్లకు రావడానికి సిగ్గులేదూ, మనకు సూడ్డానికి సిగ్గులేదూ అంటా ఒకరికితో ఒకరు మాట్లాడుకుంటా నల్లమోడాలను ఎగతాలి జేస్తా పోతా వుండారు.

సారవ దాటి నాలుగడుగులు వేసినారో లేదో, పిరికెడు లావు సినుకులు రాళ్లు ఇసిరేసినట్టు కిందపడతా దబదబ మొదలైంది మంచి మోదు. సంకల్లో వుండే గడ్డిగంపలు తీసి నెత్తికి బోర్లిచ్చుకోని ఇంటికి పరుగులు తీసినారు అందరూ.

రాగడి సేలన్నీ నోర్లు తెరుసుకోని ఆకలికి మొగమాసి, వడగండ్లను ఆబగా మింగేసినట్టు తినేసినాయి. ఎండ్రకాయ నీళ్లు గక్కినట్టు, నెర్రెల్లోనుంచి అప్పుడే నీళ్లుగక్కుతా వుండయి రాగడి సేలు.

కొందరు బండపదును వానంటే, శానామంది పదునోనే అంటా ఒకరి మాట ఒకరు యినకుండా మాట్లాడుకుంటా వుండారు.

''వూరికె ఫైమాటలన్నీ ఎందుకు. అందరమూ ఒకసారి సాంబడు సేలోకి బొయి ఎంత పదునైందో చూసొస్తే పోలా'' అంటా సుబ్బాడ్డిమామ అందర్నీ తీసకపాయినాడు సేలోకి.

బండపదును గాదు సేను పదునే అది. జానెడులోతు నానింది. విత్తనానికి ఇంతకంటే ఏంగావాల. ఐదారు దినాల్లో ఇత్తనమేసుకోవచ్చు. అనుకుంటా ఒక్కొక్కరు కుశాలగా, నగు మొకాల్తో వస్తావుండారు.

* * *

వూర్లో వాన పడిందంటే పండగమాదిరే వుంటాది. ముఖ్యంగా ఆ సింతసెట్టుకింద. గిలక బావిని ఆనుకోని వుండే ఆ సెట్టుకింద ఒకతిక్కు కిర్రుమని అరిసే గిలక శబ్దాలు, ఆ శబ్దాలను దాటుకుని కొలిమి పొగలు, ఈరొంటికీ దరువేసినట్టు సమ్మెట దెబ్బలు, సినుకుల కాలం ఆ సెట్టుకింద కొలిమి సెగలు తగుల్తాన్నా ఇంగారొంత సేపు కూర్చోబుద్దయితాది.

> సెడిపోయే వాన్ని చెయిపట్టుకోని వద్దామని అనుకుంటాదే అది మాబుకు వెయ్యేనుగుల బలంరా సిన్నోడా. మంచికి మంచే సాక్షము నాయనా. ఏదైనా పన్జెయ్యాలని నమ్మకంతోనే పన్లోకి దిగాల. మాబున్నీసా మనసంతా పిల్లోల్లను పెద్దోలను జెయ్యాలనేదే. సాటి మనిసి బాధల్ను మాల్లేక పొయ్యేదిరా మాబు. ఈశ్వరమ్మ కొట్టంగాల్తే, మొగోల్లందరూ మంటల్లోకి పోతే పాణం పోతాదనుకున్నేరు గానీ, ఈశ్వరమ్మ ఏమైతాదో అని ఎవురూ అనుకోలేదు. మాబూ అట్టనుకోలేదురా. కొండంత బరువాచ్చిపన్నే గుండెకాయను అడ్డేసింది.

రసూల్‌మియా అంటే ఊరందరికీ మామంచి కాడే. కొందరు అన్నా అంటే శానామంది మామా అంటా వుంటారు. రసూల్‌మియా భార్య మాబున్నిసా. సమ్మెట ఏసిందంటే ఎంత మూతి ముడుసుకున్న ముడి ఇనుమైనా సరే రూపానికి రావాల్సిందే. మనికట్టులావు మిసాలు బెంచినోడూ, నాకన్నా బలమైన వాడు లేడూ అనేవాడెవడూ కొలిమి కాడికి రానే రారు. ఎందుకంటే మాబున్నిసా సమ్మెట ఏస్తావుంటే ఈల్లందరికీ సెమట పడ్తా వుంటాది. ఒక్కో దెబ్బ ఎర్రంగా కాలిన ఇనుమ్మీద పడ్తావుంటాది. దాంతో పాటే సెమట కూడా పడ్తావుంటే నిప్పులు సురుక్కుమంటా వుంటాయి.

ఊర్లో అందరూ వరసలతోనే బిల్సుకుంటా వుంటారు రసూల్‌మియా కుటుంబాన్ని. రసూల్‌మియా కొలిమి సామాన్లు సరుస్తా వుంటే, మాబున్నీసా సమ్మెట ఏస్తా వుంటాది.

* * *

సింతసెట్టుకు ఎర్రటి కోక ఉయ్యాల యాలాడ్తా వుంది. దాంట్లో మాబున్నిసా మూడో బిడ్డ వూగుతా నిద్రబోతావుంది. అప్పుడప్పుడు కొలిమి పొగలు ముక్కులకు తగలగానే మూలుగుతా వుంటాడు. మల్లా ఒకసారి ఉయ్యాల కదిలిస్తే నిద్రపోతాడు. ఆడికొచ్చే వాల్లందరూ ఒకచేత్తో వాన్ని కదిలిస్తానే వుంటారు. వాడు ఊగుతానే వుంటాడు. సినుకులు పడటంతో రైతులందరూ యార ముట్లు పదునుపెట్టుకోవాలని ఒకరికంటే ఒకరు ముందొచ్చి కొలిమికాడ నిలబన్నేరు.

ఇట్టాంటి సీజన్లోనే నాలుగు రూకలు కండ్లజూసేది రసూల్‌మియా కుటుంబం. పొద్దన్నే బొగ్గులు బోసి, ఓ గంట సేపు గాలిబూరె ఊదినాక బొగ్గులు వేడెక్కుతాయి. అప్పుడు రసూల్‌మియా కొలిమికాడికొస్తాడు.

ఆరోజు పొద్దనే కొండ్రెడ్డి సిన్నాయన గుంటిక పలుగు పదును పెట్టుకోవాలని వచ్చినాడు. కొండ్రెడ్డి రొంత ఎకసెక్కం మాసి. ఆడోళ్ళను చూస్తానే కొండికి రొంత నీరెక్కుతాది. రసూల్‌మియాను ఎప్పుడూ తమ్ముడూ తమ్ముడూ అంటా వుండేవాడు.

ఆరోజు వచ్చీరాగానే మాబున్నీసాతో ఏదో పరాసికాలాడితే.. సమ్మెట గురితప్పి బొగ్గుల మీద పడేలోకే నిప్పులు చివ్వున పైకి లేసినయి. అంతే! కొండ్రెడ్డి బారెడు అవతల పన్నేడు. అప్పట్నుంచీ ఇప్పటివరకూ మాబున్నిసాతో ఎప్పుడూ పరాసికాలాడడు. రసూల్ మియా మాత్రం ముసిముసి


## కాస్మటిక్ దంతవైద్యం



"ఆక్సిడెంట్‌లో పళ్ళు విరిగి ఎగుడుదిగుడుగా ఎంత వికారంగా ఉండేవాడినో చూశారా? అందుకే 'స్మైల్ డిజైనింగ్' చేయించుకొన్నా. చూడండి కేవలం మూడు సిటింగుల్లో నన్ను ఎంత అందంగా మార్చేశారో!!"



స్పెషలిస్ట్ కామెంట్....

"కాస్మటిక్ చికిత్సలతో సైడ్‌ఎఫెక్టులు ఉంటాయి,
పళ్ళు కదిలిపోయి భవిష్యత్తులో సమస్యలొస్తాయి,
అందరికీ పళ్ళు పీకేస్తారు,
రిజల్టు ఎక్కువ కాలం ఉండదు,
విపరీతంగా నొప్పి పెడుతుంది,
ఆఫీసుకు సెలవులు పెట్టాలి, బెడ్‌రెస్టు అవసరం,
డాక్టరు దగ్గరికి నెలలు, సం॥లు తిరగాలి"
- లాంటి వన్నీ అపోహలే!!!

## పార్థ దంతవైద్యశాల & రీసర్చి సెంటర్

హైదరాబాదు : స్కిల్ స్పెక్ట్రం కాంప్లెక్స్, టి.టి.డి. కళ్యాణ మండపం ప్రక్కన, లిబర్టీ సెంటర్, హిమయత్ నగర్. ఫోన్:040-55991010, 23222200

తిరుపతి: ఆర్.టి.సి. బస్టాండ్ వెనుక, శ్రీనివాసం కాంప్లెక్స్ ఎదురుగా, పెద్దకాపు లేఔట్. ఫోన్:0877-2250555, 2250105

విశాఖపట్నం : (నవంబర్ 1న ప్రారంభం) రామా టాకీస్ జంక్షన్, HYUNDAI కార్ల షోరూంపైన, ఫోన్:9399940104

ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు మరియు రిటైరయిన వారి బిల్లుల రీఎంబర్సుమెంటు కొరకై రాష్ట్ర ప్రభుత్వం, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్, ఎ.పి. వారిచే గుర్తింపబడిన దంతవైద్యశాల

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

నవ్వులు నవ్వుకుంటా వుండాడు.

* * *

మాబున్నీసాకు చేతిలో పిల్ల, సంకలో పిల్ల, బుజమ్మీద పిల్ల. నాలుగోసారి గర్భవతి. ఆరోజు బేస్తవారం. సీకటి పడేదాంకా సమ్మెటేసింది నిండు నెలలతో. పొద్దన్నే కాన్పయింది. మంత్రసాని రామ తులసి మాబున్నీసాకు నాలుగు కాన్పులు చేసింది. ఇప్పుడు మల్లా మొగపిల్లోడే. పెద్దోని పేరు రఫీక్, రెండోవాని పేరు కరిముల్లా, మూడోసారి ఆడపిల్ల జహురున్నీసా. నాలుగోవాని పేరు గౌస్ మొద్దీన్ అని బెట్టింది. ''ఇసారన్నా ఆపరేషన్ జేయించుకో మాబూ'' అంటా లింగమ్మత్త ఎంతజెప్పినా... ''ఆ.. నారుబోసినోడు నీరుబొయడా సిన్నమ్మా'' అంటా వినుకోలేదు.

ఊర్లో అందరూ ఈయమ్మికి శక్తి యాన్నుంచి ఇచ్చినాడో దేవుడు, నలుగురు పిల్లోల్లను కని, ఆ వంతున సమ్మెట ఏస్తా వుందంటే ఇంతకీ శానా సోద్యమే అనుకునేవారు.

ఒకసారి సంకురాత్తిరి పండగ జరుగుతా ఊరంతా జాతర మాదిరి వుండాది. కొత్తగా పెండ్లిండ్లు జేసుకుని అల్లెం తిన్నె అల్లుళ్లందరూ ఊర్లో పోటీలు బడి బరువులెత్తుతా వుండారు. ఎవురు బాగా బరువెత్తితే వెండిపల్లెం వాళ్లకే.

ఇసారి లింగమ్మత్త ఒక ఉపాయం వేసింది. ''మాబూ, ఏం మిసాలున్నోల్లేనా బరువెత్తేది. ఇసారి నువ్వెత్తు. పిల్లలుగల్ల దానివి వెండిపల్లెం వస్తే నాలుగు రూకలు ఇంట్లో వున్నెట్టేగదా'' అని సెప్పించి మాబున్నీసాతో.

''ఏంది సిన్నమ్మా. మొగోల్లందరూ ఎత్తుతా వుంటే నేనెట్టా బొయ్యేది. నీకు రోంతన్నా బుద్ధి లేదు'' అనిజెప్పింది మాబున్నీసా.

''ఏమీ నువ్వు రోజూ సమ్మెట మొగోల్ల ముందర వెయ్యలేదా. ఈపొద్దు బరువెత్తుతేనే నామోషీనా. ఏందిమే అట్ట పిచ్చిమాటలు మాట్లాడ్తావు. ఈ నయాల్లందరూ మిసాలు బెంచుకునింది మొగోల్ల మని సెప్పుకుండేదానికే గానీ, బరువెత్తేదానికా. ఈల్ల మొగాలు సూడు, నూనెతోటి అత్తరాసలు దిని గసపోసుకుంటా వుండారు. వీళ్లు ఎత్తలేరుమ్మే నా మాట విను. సూడ్డానికే సోగ్గా కనపడ్తారు. పనికి పోతురాజులు తిండికి తిమ్మరాజులు వీళ్లు'' అంటా మాబున్నీసాను బాగా ఉపికిచ్చింది.

ఊర్లో అందరూ బరువుగుండు ఎత్తుతాండారు గానీ, ఎవరికీ వశపడతాలేదు.

అందరూ అయిపోయినాక మాబున్నీసా నేనెత్తుతా బరువుగుండు అని వచ్చింది. ఆవూరి అల్లుండ్లందరూ కండ్లు ఎర్రంగ జేసినారు. ''మాబున్నీసా! ఇదేమన్నా సమ్మెట అనుకున్నావా. బరువుగుండు. డెబ్బైకేజీలు పైనుండాది. నీచేతేమయితాది. నీ మొగుడు, నీపిల్లోల్లు అందరూ వచ్చినా ఎత్తలేరు'' అంటావుండాడు ఎకసెక్కెంగా పద్మావతిని చేసుకున్న కొత్త పెళ్లికొడుకు కిట్టయ్య.

ఈల్లందరి మాటలూ పట్టించుకోకుండా మాబున్నీసా సరసరా వచ్చి బరువుగుండు అనగపట్టుకుని, బుజాలదాంకా ఎత్తి వీపుదిక్కునుంచి వెనక్కి వేసింది.

కొత్తపెళ్లికొడుకులకు ఒక్కరికి కూడా మొకంలో నెత్తర సుక్కలేదు. రాత్తిరి దేవలం దగ్గరకు పిలిసి మాబున్నీసాకు వెండిపల్లెం ఇస్తావుంటే, ఆడోల్లందరూ మొగోల్లదిక్కు చూసి నవ్వుతా వుండారు. మిసాలు దువ్విన మొగోడొక్కడు గూడా గుడికాడికి వచ్చింటే ఒట్టు.


* * *

''ఎద్దు కాడిమరిగినా, పిల్లోడు చెయికిందికొచ్చినా ఆ సంసారము బాగా వృద్ధిలోకొస్తాదిరా'' అంటా వుండేవాడు చెన్నుతాత. ఆ తాత చెప్పింది నిజమే.

రసూల్ మియా ఏటికేటికీ మెత్తబడినాడు. మాబున్నీసాకు మొగోని మాదిరి సమ్మెటేస్తాంది గానీ, కొడవండ్లను, మచ్చుకత్తులను, గుంటిక పలుగులను రూపానికి తెచ్చే యోగ్యత లేదు.

పెద్దోడు రఫీకును పనిలోకి దించినారు. నాలుగేండ్లనుంచి నాయన దాపున పని నేర్చుకున్న రఫీకు ఇప్పుడు నాయనకు దీటుగా జేయడం మొదలుపెట్టినాడు.

వాడు పనోడయినాక మాబున్నీసా మొకంలో ఎప్పుడూ నవ్వు తారట్లాడతా వుంటానే వుంది.



రసూల్‌మియా పన్లోకి రాకపోయినా రఫీకు ఊరం దరి యారముట్లను కొలిమిలో కరిగిచ్చి, పదును పెడతా వుండాడు. ఇంగ ఆపుగా అమ్మ వుండనే వుంది.

* * *

ఉగాది పండగ నాలుగురోజులే వుండాది.

ఊర్లో కొందరు కొట్టాలపై బోదగడ్డి కప్పు కుంటా వుండారు. చౌడుమిద్దెలోల్లు సున్నాలు కొట్టుకుంటా వుండారు. హవేలి పెంకులేసుకున్న మాబున్నీసా గూడా అన్ని పండగలూ జేస్తాది.

ఆరోజు మాపటేల దాంకా ఆడోళ్లందరికీ పిల్లిపె సర కోసుకోవడానికని తీసుకొచ్చిన కొడవలిక్కులకు బాగా పదును బెట్టి ఇచ్చింది.

మధ్యానానికే బొగ్గులు ఆర్పేసి, కొలిమి ఎత్తి పెట్టి సెట్టుకింద కోక ఉయ్యాల్లో ఉండే పిల్లోని తీసు కోని ఇంటికి బోయింది.

నాలుగు సున్నం పెల్లలు ఊరబోసి, గోడలకు సున్నం కొట్టడం మొదులుబెట్టింది. ఊర్లో అందరి ఇండ్లూ తెల్లంగ వుంటే మన గోడలు ఎందుకుం డాలా నల్లంగా అని, సాయంత్రానికి గోడలన్నీ తెల్లంగ జేసింది.

మాబున్నీసా ఇంటిపక్కనే ఈశ్వరమ్మ ఇండ్లు.

''ఏం ఈశ్వరమ్మక్కా! నా గోడలకన్నా మీగోడలే తెల్లంగా వుండాయక్కా'' అంటా పలకరిచ్చింది.

''లేదులే మాబూ! ఈరోజు సున్నంగొడ్తే రేపు బాగా కనబడ్తాయి'' అని జెప్పింది ఈశ్వరమ్మ.

గడ్డికి బొయిన ఆడోళ్లందరూ ఇంటికొచ్చినారు. బరిగొడ్లు తోలకపోయిన పిల్లోల్లుగూడా దాండ్లను కట్టేసి, అమ్మల కాన్నుంచి దూళ్లను దూరం జేస్తా వుండారు.

పొలానికి బొయినోళ్లూ వచ్చి ఇంటికి జేరుకు న్నేరు. ఇంతలోనే ఒక్కసారిగా ఊర్లో కేకలు. ఈశ్వ రమ్మ కొట్టం సూరుకు మంటినూనె బుడ్డి అంటుకు న్నేది.

గప్పున మంటలు కనపడ్తానే ఊరందరూ బ్యారుమంటూ వీధిలోకొచ్చినారు. కొంపంటుకు న్నేది. పండగపూట కొంప కాలిపోతాంటే ఈశ్వ రమ్మ మతి తప్పి కిందపడిపోయింది.

మాబున్నీసా ఇండ్లుగూడా పక్కన్నే కదా. కడ వల్తో నీల్లు బోస్తావుండారు కొందరు. మట్టిబోస్తా వుండారు కొందరు. అయితే తిండిగింజలన్నీ ఇంట్లో మూటల్లో వుండాయి.

మీసం తిప్పినోల్లందరూ మంటల్లోకి బోలేకపో తాండారు. మాబున్నీసా మాత్రం మంటల్లో ఇంట్లోకి దూరిపోయింది. నూరుకేజీల రాగుల మూట ఈపునేసుకోని వచ్చింది. మాబున్నిసాను చూసి అందరూ మిడిగుడ్లేసినారు. అయితే ధైర్నం జేసుకోని మాబున్నీసా దాపున బోయి గుడ్డలు, రగ్గులు, తిండిగింజలన్నీ బైటేసినారు.

మా లింగమ్మత్తయితే 'మాబున్నీసాకు యాడు న్నేదిరా బలం. ముగ్గురుపడ్తేగాని లెయ్యదు ఆ రాగుల మూట. అట్లాడిది అదొక్కతే లేపుకోనొచ్చిం దంటే నమ్మబుద్దికాలే' అంటా మనసులో అనుకు న్నేది.

మంటలన్నీ ఆర్పినారు.

కానీ రసూల్‌మియాను ఎవరూ జూసినోల్లు కాదు. ఇంటిపక్కనిండ్లు. మనిండ్లు యాడకాలిపో తాదోనని రసూల్‌మియా.. ఆ మంటల్ను జూసి వారపాకు దగ్గరే పడిపోయినాడు.

మాబున్నీసా ఇంటికొచ్చి చూస్తే లక్వాగొట్టి తనుకులాడతా వుండాడు. మూతి సొట్టబొయింది. కుడికాలు, కుడిచేయి సచ్చుబన్నెయి.

ఈపక్క కొట్టంగాలిపోయి ఈశ్వరమ్మ ఏడుస్తా వుంటే, ఇంగోపక్క మొగుడికి లక్వాకొట్టి మాబు న్నీసా గోడుగోడు మంటావుంది. పిల్లోల్లు నాయన్ను జూసి మొకం నేలకేసుకోని కండ్లనీల్లు బెట్టుకున్నేరు.

రసూల్‌కు లక్వాకొట్టిన సంగతి లింగమ్మత్తకు తెలిసింది. ''నువ్వేమీ భయపడగాకు మాబూ.


హ్యాట్రిక్ ! హ్యాట్రిక్ !! హ్యాట్రిక్ !!!

రాష్ట్ర ప్రభుత్వంచే వరుసగా 3 సార్లు బెస్ట్ స్కూల్ అవార్డు పొందిన ఏకైక విద్యా సంస్థ - శశి వేలివెన్ను








ప్రతిష్టాత్మక బెస్ట్‌స్కూలు అవార్డును వరుసగా 3 సం॥లు రాష్ట్ర ముఖ్యమంత్రి డా॥ వై. యస్. రాజశేఖరరెడ్డి గారి నుండి స్వీకరిస్తున్న శశి విద్యా సంస్థల ఛైర్మన్ శ్రీ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ గారు.

శశి

వరుసగా మూడవసారి "బెస్ట్‌స్కూల్" అవార్డు అందుకోవడం శశి విద్యా సంస్థలకు మిక్కిలి ఆనందకరం.
రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ ప్రతిష్టాత్మక బహుమానం శశి కృషికి సమున్నత కొలమానం.

ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, వేలివెన్ను. ✆ 08819-283513-516
ఇంగ్లీష్ మీడియం, వేలివెన్ను, దువ్వ, తణుకు, తాడేపల్లిగూడెం
జూనియర్ కాలేజ్ & మహిళా జూనియర్ కాలేజ్, వేలివెన్ను
జూనియర్ కాలేజ్ , తాడేపల్లిగూడెం - నారాయణ జూనియర్ కాలేజ్, తణుకు
డిగ్రీ కాలేజ్, వేలివెన్ను
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & ఇంజనీరింగ్, తాడేపల్లిగూడెం. ✆ 08818-244986-988

Sri Sai Balaji Ads.NDD Ph : 222488, 320777

నారుబోసినోడు నీరుపోస్తాడు. అయినా చేతికింది కొచ్చిన కొడుకుండాడు. మొగరాయుడు మాదిరి నువ్వుండావు. ఎందుకమ్మే భయపడ్తావుండావు. నాలుగురోజులు నూగులు నూనె, పావురాయి రగతమూ కాలికీ, చేతికీ బాగా రుద్దు. రసూల్ మల్లా తిరుక్కుంటాడు. మా మందలో ఒకటి మేకపోతు కోసి ఎండబెట్టిన మాంసమూ, రాగిసంగటి తినిపి. లక్ష్వా వచ్చిన దావన్నే బోతాది'' అంటా ధైర్నం చెప్పాలకే మాబు రోంత కోలుకున్నేది.

* * *

ఊర్లోకి రంగుల డేగలు వచ్చి వాలినయి. కొత్త మిద్దె గంగిరెడ్డి తళతళమని మెరుస్తా వుండే ట్రాక్టరు దింపినాడు ఊర్లో. ఒకర్ని చూసుకోని ఒకరు యారమొట్లు కూడా ఎత్తిపెట్టడం మొదలుపెట్టినారు. పాటలు పాడ్తా వరికోస్తావుండే కూలోళ్ల నెత్తిమింద సిబ్బి బోల్లిచ్చినట్టు, వరికోత మిసన్లు ఖణఖణమని మోగుతా ఊర్లోకి వచ్చినాయి.

నూరింటికి జనం చేసే పని ఒక మిషనే చేసిపారేస్తా వుంది. పారలు, పలుగులు, లిక్కులూ, మడక్కొర్రులు చిన్నంగ మచ్చుమిందకు ఎక్కినయి.

నాయనకు లక్ష్వాకొట్టినా, పెద్దకొడుకు చేతికింది కొచ్చినాడులే అన్నె ఆశకూడా సచ్చిపోయింది మాబున్నీసాకు. బొగ్గులు కాలిపోవడమే గానీ, కొర్రు కొలిమిలోకి రాడంలే. గాలిబూర ఊదినా రెక్కలు పడిపోవడమే గానీ, గాలికి ఉపయోగము లేదు. రఫీకు కూడా నాయన మెత్తబన్నేల నుంచి మన మతిలో లేడు. పిల్లోల్లు పెద్దోలయినారు గానీ, సింతసెట్టుకు కట్టిన కోక ఉయ్యాల చిరిగి బారెడు ముక్క యాలాడతానే వుంది.

చేసేపని లేకపాయె, వేరేపని సేతగాకపాయె. నలుగురు పిల్లోల్లు, ఆలుమొగుడు ఎట్టబతకాల్రా అని ఎర్రిమొగమేసింది మాబున్నీసా.

చీమగ్గూడా అన్యాయం జెయ్యలె. దేవుడనేవాడుంటే మేలుజెయ్యకుండా బోడు అని అనుకుంటా మొగుడూ పిల్లోలకు ధైర్నం చెప్పినాది.

* * *

బొంబాయినుంచి ఎవరో పెద్దసాయిబు వచ్చినాడు. కువేటులో షేకులు ఇక్కన్నుంచి జనాన్ని పిల్సుకరామని పంపినాడని చెబుతావుండాడు. వచ్చీరాని తెలుగులో మాట్లాడతా వుండాడు.

మాబున్నీసా దేవునిమింద భారమేసి, రఫీకును పంపడానికి సిద్ధమైంది. ఊర్లో అందరూ ఎవురూ ఆ సాయిబును నమ్మలే.

పైసా పైసా కూడబెట్టిన పదివేలు బైటికి తీసింది. బరువుగుండెత్తి గెల్చుకున్నె వెండిపల్లేన్ని అమ్మేసింది. ఆ రైతును, ఈ రైతును బతిమాలి ఇంగో ఇరవైవేలు తెచ్చి, నలభై వేలకు రఫీకును కువేటుకు పంపడానికి సిద్ధం చేసింది. ముందు మాబున్నీసాకు డబ్బులివ్వడానికి వెనకా ముందూ చూసినారు రైతులు. కానీ మల్లా నమ్మి తలా ఐదువేలు ఇచ్చినారు.

పాపం సాయిబు నమ్మకస్తుడే. విమానం ఎక్కించాల్దాకనే నా బాధ్యత, అవతల సేటు ఏపనయినా చేయిచ్చుకుంటాడు అని తన యాసలోనే చెప్పినాడు.

ఏమ్మైతేనేం కమలాపురం టేషన్లో బొంబాయి రైలెక్కినాడు రఫీకు. మొగునికి లక్ష్వా కొట్టినప్పుటికన్నా యిప్పుడు ఎక్కవగా ఏడ్సింది మాబున్నీసా, రఫీకు కువేటుకు బోతావుంటే. సేతికొచ్చిన కొడుకు పరాయి రాజ్యానికి పోతావుంటే కండ్లమ్మటీ నీళ్లు ఆగకుండా కురుస్తానే వుండాయి ఆమెకు.

ఊర్లో అందరూ టేషనుకొచ్చినారు. రఫీకు స్నేయితులందరూ ఏడుస్తా సేతులూపి పొమ్మని చెబుతా వుంటే, రఫీకు కుమిలి కుమిలి ఏడ్సినాడు. నాకు ఆదేవుడి దయవలన బాగుంటే మిమ్మల్నుగూడా నా తోడుకు పిల్సకపోతారా అంటా అందర్నీ దగ్గిరికి పిలిపిచ్చుకోని సెబుతావుంటే, రఫీకు ప్రాణ స్నేయితుడు లచ్చిమినారాయణకైతే నోట మాటరాలేదు. రైలు కూత యేస్తా ముందుకు కదుల్తానే అందరూ ఒక్కసారి బ్యారుమని ఏడ్సినారు. సిన్నప్పట్నుంచీ అందరూ కలిసి సెరువుకింద మల్లల్లో ఆడుకున్నేల్లు. దొంగగా మాడికాయలు కోసుకొచ్చినోల్లు. బురదగుంతల్లో శాపలు


దర్శించండి. సేవించండి.. తరించండి....



# శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం



ఇంద్రకీలాద్రి, విజయవాడ. Ph: 2425744, 2423600, 2423800

దుర్గమ్మను దర్శించండి ! **శ్రీ చక్రనవావరణార్చన** దీవెనలు పొందండి!!

శ్రీ చక్రరాజనిలయా శ్రీమత్త్రిపురసుందరీ, శ్రీ శివా శివశక్త్యైక్య స్వరూపిణీ లలితాంబికా॥ అని లలితాసహస్రనామ స్తోత్రంలో చెప్పినట్లుగా, సృష్టిస్థితి లయకారిణైన ఆదిశక్తి మన దుర్గమ్మ, పవిత్రమైన ఈ ఇంద్రకీలాద్రి మీదలలితాస్వరూపిణిగా ఆ తల్లి నిత్యం పూజలందకుంటూ ఉంది. అత్యంత మహిమోపేతమైన శ్రీ చక్రంలో నిత్యం ఆ తల్లికొలువుదీరి వుంటుంది. అందుకే శ్రీ చక్రాన్ని అర్చిస్తే ఆ తల్లిని అర్చించినట్లే అని పెద్దలంటారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ప్రత్యేకంగా భక్తుల సౌకార్యార్థం శ్రీ చక్రనవావరణార్చన ఐశ్వర్యప్రదమూ, ఆరోగ్యప్రదమూ అయిన చక్రనవావరణార్చనలో భక్తులు ఎవరైన పాల్గొనవచ్చును. అలాగే రూ. 6,000/- లు ఒకేసారి చెల్లించినట్లయితే భక్తుల గోత్రనామాలతో ప్రతిసంవత్సరం వారు కోరిన రోజున శాశ్వతంగా ఈ నవావరణార్చన జరిపించబడుతుంది. కావున భక్తులందరూ ఈ అర్చనా కార్యక్రమంలో పాల్గొని తరించవలసిందిగా కోరుతున్నాం పూజా రుసుము 516/-రూ. (దంపతులకు) గమనిక : పూజాద్రవ్యములన్నీ దేవస్థానం వారే ఏర్పాటుచేస్తారు. పూజానంతరం దంపతులకి అమ్మవారి అంతరాలయం, ఉపాలయాల్లో ఉచితదర్శన సౌకర్యం కల్పించుటమైనది.

**శాశ్వత అన్నదాన పథకం**

★ శాశ్వత అన్నదానం 8 మందికి (సంవత్సరంలో ఒక రోజు) రూ. 1116/- ★ శాశ్వత అన్నదానం 35 మందికి (సంవత్సరంలో ఒక రోజు) రూ. 5116/-

అన్నదాన పథకం కార్యక్రమములో పాల్గొనదలిచిన భక్తులు కార్యనిర్వాహణాధికారి శ్రీ దుర్గామల్లేశ్వర దేవస్థానము ఇంద్రకీలాద్రి విజయవాడ వారి పేరున డి.డి. కాని. యమ్.ఒ ద్వారా గాని పంపవలెను.

**శాశ్వతపూజలు - రుసుములు**

| | | | |
|---|---|---|---|
| శాశ్వత లక్షకుంకుమార్చన | రూ. 10,000/- | శ్రీ మల్లేశ్వరస్వామి వారికి శాశ్వత అభిషేకం | రూ. 10,400/- |
| శ్రీ అమ్మవారికి శాశ్వత సహస్రనామార్చన (52 శుక్రవారములు) | రూ. 26,000/- | శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో | |
| శ్రీ అమ్మవారికి శాశ్వత అష్టోత్తరం (52 శుక్రవారములు) | రూ. 1,3000/- | శాశ్వత సర్పదోష నివారణపూజ | రూ. 1,116/- |

**పిడపర్తి నారాయణరెడ్డి** ఛైర్మన్ మరియు ధర్మకర్తలమండలి సభ్యులు **ఇ. గోపాలకృష్ణా రెడ్డి.** జాయింటు కమీషనరు. మరియు కార్యనిర్వహణాధికారి.

చదవండి.. **శ్రీ కనకదుర్గ ప్రభ** (ఆధ్యాత్మిక మాస పత్రిక) చదివించండి...

దేవస్థానం వారి ప్రచురణ.. ఫోను : 0866-2423700

సంచిక వెల రూ. 10/- వార్షిక చందా రూ. 100/- లు. శాశ్వత చందా రూ. 2500/- లు

పట్టినోళ్లు. అందుకే అంతగా బాధపడతా వుండారు. మొగపిల్లోల్లందరూ టువాళ్లతో కండ్లనీల్లు తుడుసుకుంటా ఇంటిదావ బట్టినారు.

* * *

జాబురాక రొన్నెలయ్యింది. ఊర్లో అందరూ ఇంగయాడ రఫీకు.. అంటా వుండారు. ఆ మాటలి న్నెప్పుడల్లా మాబు గుండె కలుక్కుమంటా వుండాది గానీ, వాళ్ల ముందర దైర్నంగానే వుంది.

సరిగ్గా రొన్నెల్లయింది. ఆరోజు శుక్కురారం. ఎప్పుడూ ఇంటికి వచ్చేవి కావు. ఆరోజు పోస్ట్‌మాన్ ''మాబున్నీసా నీకు జాబొచ్చిందమ్మా కువేటునుంచి'' అంటా జాబు సేతికిచ్చినాడు.

ఈశ్వరమ్మ కొడుకు వెంకటేశును పిలిపిచ్చుకోని సదివిచ్చుకున్నేది మాబున్నీసా. కర్జూరం సెట్లకు మడవ గట్టేదంట. పని బాగానే వుంది. రాజంపేట వాళ్లు గూడా ఇద్దరుండారు. నాకేమీ ఇబ్బంది లేదు. మీరేమీ భయపడాకండని రాసినాడు. ఆరు నెల్ల జీతం ఒకటేసారి పంపిస్తా అని రఫీకు రాసిన జాబు వెంకటేసు చదువుతా వుంటే, మాబు మొకం శాటంత ఎల్పు అయింది. రొండేండ్ల కల్లా హవేలి తీసేసి మిద్దేసింది మాబున్నీసా. '' ఈశ్వరమ్మక్కా! దేవుడు సల్లని చూపు చూడాలగానీ, మిద్దెలు మేడలు ఒక లెక్కా. ఆయన కండ్లెర్ర జేసినా గూడా ఇవి నిలబడవక్కా'' అంటా ఈశ్వరమ్మతో మాట్లాడతా వుంది మాబున్నీసా.

ఊర్లో సిన్న సిన్న పనులకు గూడా కొలిమి లేదు. పొగలన్నీ ఆరిపొయినాయి. బొగ్గులన్నీ బూడిదయి పోయినాయి. గాలిబూరెకు సెదులు పట్టింది. సమ్మెట పీటె మూలకుజేరింది. సుత్తె, పట్టకార్ర ఇంట్లో సీలలు కొట్టుకోడానికే పనికొస్తావుండాయి.

సింతసెట్టుకు గట్టిన కోకముక్క మాత్రం యాలాడతానే వుంది. కొలిమి ఎత్తేసినా ఆ నేల మాత్రం నల్లంగనే వుంది.

* * *

ఒకరోజు బాగా ఆకాశం దిక్కు చూస్తా, సుక్కల్ను, చందమామను చూసుకుంటా నులక మంచమ్మీద పండుకోని వుంటే నా పక్కనే మా చెన్ను తాత వచ్చి కూర్సున్నేడు. అప్పుడు నేను ''తాతా! మాబున్నీసాకు అంత శక్తి ఎవురిచ్చినారు తాతా'' అని అడిగినా బరువు గుండెత్తిందీ, కొట్టం కాల్తా వుంటే రాగుల మూట బయటికి తెచ్చిందీ, సమ్మెట ఏసేదీ అన్నీ గుర్తుకొచ్చి.

అప్పుడు మా తాత ''దాని యెనకాల పెద్ద కథుంది నాయనా. అందరికీ కనబడ్తానే వుంటాది గానీ, ఎవురూ పట్టిచ్చుకోరు. మాబుకు కుడిసేతి బలము రఫీకు అయితే, ఎడమసేతి బలము కరి ముల్లా. గుండెకాయ జహురున్నిసా అయితే, మనసు గౌస్‌మొద్దీన్. సెడిపోయే వాన్ని చెయిపట్టు కోని వద్దామని అనుకుంటాదే అది మాబుకు వెయ్యే నుగుల బలంరా సిన్నోడా. మంచికి మంచే సాక్షము నాయనా. ఏదైనా పన్జెయ్యాలని నమ్మకంతోనే పన్లోకి దిగాల. మాబున్నీసా మనసంతా పిల్లోల్లను పెద్దోలను జెయ్యాలనేదే. సాటి మనిసి బాధల్ను చూల్లేక పొయ్యేదిరా మాబు. ఈశ్వరమ్మ కొట్టం గాల్తే, మొగోల్లందరూ మంటల్లోకి పోతే పాణం పోతాదనుకున్నేరుగానీ, ఈశ్వరమ్మ ఏమైతాదో అని ఎవురూ అనుకోలేదు. మాబూ అట్టనుకోలేదురా. కొండంత బరువొచ్చిపన్నే గుండెకాయను అడ్డే సింది. కారుకూతలు కూస్తే కరుకుగుండెతో వుంటా ది, ఇబ్బంది పడేవాళ్లను జూస్తే ఐసుగుండెరా.

బాగలేనప్పుడు అందరూ తలా ఒక మాట అనేవాళ్లే, బాగుపన్నేక ఎవర్నీ ఎవరూ పట్టిచ్చుకోరు నాయనా. అయితే మాబు బాగుపన్నేక కూడా మనూర్లో రఫీక్కు జెప్పి ఎంతమందికి విసాలిప్పిం చిందనుకున్నేవు. వాల్లు గూడా బాగుపన్నేరు. ఒకరి బాగు కోరుకున్నేల్లు ఎప్పుడూ సెడిపోరు సిన్నోడా. మంచి మనసుండాల. మంచి బుద్ధి వుండాల. నువ్వుగూడా నాయనా... ఏదన్నా మంచి చేయాల నుకున్నెప్పుడు ఆ సింతసెట్టుకు యాలాడతా వుండే కోక గుడ్డను చూసి గురుతు పెట్టుకో'' అంటా మా చెన్ను తాత సెబుతావంటే నులకమం చమ్మీద బంత కూడా పరుసుకోకుండా అట్నే నిద్ద ర్లోకి జారుకున్నే!



ఆంధ్రజ్యోతి, భీమవరం, 9985411554